క్లుప్తంగా

'ఇస్తేమా' ఏర్పాట్ల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, నాయకులు

శంకర్‌పల్లి: జనవరి 3, 4, 5 తేదీలలో శంకర్‌పల్లి పట్టణ శివారులోని జంబోరి గ్రౌండ్స్‌లో మూడురోజుల పాటు నిర్వహించే 'ఇస్తేమా' కార్యక్రమ ఏర్పాట్లను ఆదివారం ఎమ్మెల్యే కాలె యాదయ్య పరిశీలించారు. సమయం ఎక్కువ లేనందునా పనులను వేగంగా పూర్తి చేయాలని, మిగిలిన పనులపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం జరిగే రోజుల్లో ఎక్కడ ఎవరికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులు, అధికారులు, నాయకులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బొల్లారం ప్రశాంత్‌రెడ్డి తదితరుల పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం కమిటీ ఎన్నిక



సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

షాద్‌నగర్: నాయీ బ్రాహ్మణ సంఘం ఫరూఖ్‌నగర్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం తాలుకా అధ్యక్షుడు రోమియో రమేశ్ ఆధ్వర్యంలో సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫరూఖ్‌నగర్ గౌరవాధ్యక్షులుగా పి.ప్రకాశ్, ఎలికట్ట శ్రీశైలం, మధురాపూర్ శ్రీనివాస్, అధ్యక్షుడిగా సమ్మెట శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా నర్సింహ, కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి, కోశాధికారిగా మంచిర్యాల సురేశ్, ప్రచార కార్యదర్శులుగా నరేశ్, రమేశ్, కార్యదర్శులుగా భిక్షపతి, మహేశ్, దేవునిపల్లి రవి, సలహాదారులుగా విశాల్, మధు, చెన్నయ్య, నర్సింహ, అనిల్, ఆంజనేయులు, శ్రీనివాసులు, మంచిర్యాల వెంకటేశ్, మహేశ్, ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు తాలుకా అధ్యక్షుడు నియామకపత్రం అందజేసి వారిని సత్కరించారు.

పీఏసీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్ తదితరులు

మంచాల: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడు జరిగిన పొరపాట్లను, పునరావృతం కాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ యాదయ్య, సీఈఓ శ్రీనివాస్, క్యాషియర్ రమేష్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధి సంకటోనిపల్లి 189వ బీజేపీ బూత్ కమిటీని నూతనంగా ఎన్నుకున్నారు. ఆదివారం గ్రామంలో జరిగిన సమావేశంలో కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా కేశవులు, ప్రధాన కార్యదర్శిగా శివలను నియమించారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాము, శ్రీకాంత్, చరణ్, వెంకటేశ్, అశోక్, రవీందర్, శ్రీకాంత్, వెంకటేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి కాపాడండి



ర్యాలీ నిర్వహిస్తున్న సమితి నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: కాలుష్యం నుంచి ప్రజలను కాపాడాలని కాలుష్య వ్యతిరేక పోరాట సమితి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి ఎంపీపటేల్‌గూడలో కాలనీవాసులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ.. పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో మున్సిపాలిటీ పరిధి మంగళ్‌పల్లి, బొంగ్లూర్, ఎంపీపటేల్‌గూడ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే కాలుష్య కారక కర్మాగారాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అటకెక్కిన స్వచ్ఛభారత్

గతంలో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలు చేసినప్పటికీ పలు కారణాలతో అవి అనుకున్న లక్ష్యాన్ని సాధించలేవు. కాగా గత పథకంలో ఉన్న లోపాలను సవరిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ పథకాన్ని ప్రారంభించాయి. కానీ ఈ కార్యక్రమం అమలుపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో మున్సిపాలిటీలో ఏ వీధిలో చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తుండడంతో స్థానికంగా ఉండే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



ఇన్ముల్‌నర్వలో పేరుకుపోయిన చెత్త

ఇళ్ల మధ్య, అంతర్గత రోడ్లపై పేరుకుపోతున్న చెత్తకుప్పలు

- దుర్గంధంతో ఇబ్బంది పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు: ఇళ్ల సమీపంలో, అంతర్గత రోడ్లపై పేరుకుపోయే చెత్తచెదారంతో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. మరెందరో చికిత్సల కోసం అప్పులు చేసి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. ఇలాంటి పరిస్థితులు, ఇబ్బందుల నుంచి ప్రజలకు విముక్తి కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ భారత్ పథకాన్ని ప్రారంభించాయి. కాగా పలు శాఖలకు చెందిన అధికారుల సమన్వయ లోపంతో పథకం మండలంలో అనుకున్న లక్ష్యం దిశగా పయనించడం లేదు. దీనికితోడు ప్రస్తుతం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలనే ఆదేశాలు లేకపోవడంతో పథకం పూర్తిగా నిలిచిపోయింది.

ఆచరణలో అధికారుల నిర్లక్ష్యం

స్వచ్ఛభారత్ పథకం ప్రారంభంలో పలువురు రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖులు పలుచోట్ల రోడ్లపై చెత్తను శుభ్రం చేశారు. వీరి స్ఫూర్తితో గ్రామాల్లో, పట్టణాల్లో కొన్నాళ్ల పాటు ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు ఒకటి, రెండు సార్లు చీపుర్లు చేతబట్టి స్వచ్ఛ భారత్‌లో భాగంగా అంతర్గత రోడ్లను శుభ్రం చేయడం, కాలనీల్లోని చెత్తను తరలించడంతో పాటు కంపచెట్లను తొలగించారు. గతంలో కూడా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలు చేసినప్పటికీ పలు కారణాలతో అవి అనుకున్న లక్ష్యాన్ని సాధించలేవు. కాగా గత పథకంలో ఉన్న లోపాలను సవరిస్తూ స్వచ్ఛభారత్ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించాయి. అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ఇందులో ప్రధానంగా ప్రభుత్వ, రాజకీయ, ప్రజాప్రతినిధులను భాగస్వాములుగా చేర్చింది. తప్పనిసరిగా అన్ని శాఖలకు చెందిన అధికారులు తమ తమ కార్యాలయాలతో పాటు సమీపంలోని గ్రామాలు, కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణకు కృషి చేయాలని ఆదేశాలు సైతం జారీ చేసింది. కాగా మొదట్లో అధికారులు ప్రభుత్వం దృష్టిలో పడేందుకు విద్యార్థులు, ఇతర యువజన సంఘాలతో ఒకటి రెండు సార్లు కార్యక్రమాన్ని నిర్వహించారు. తర్వాత దాని గురించి తమకు పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు.

ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం

స్వచ్ఛభారత్ పథకం ప్రారంభంలో మండలంతో పాటు పలు గ్రామాల్లో అధికారులు పర్యటించి ఇళ్ల మధ్యలో పేరుకున్న చెత్తతో పాటు అంతర్గత రోడ్లను శుభ్రం చేశారు. కొన్నినెలల నుంచి తిరిగి పనులు చేపట్టకపోవడంతో ఇళ్లు, అంతర్గత రోడ్లపై చెత్త పేరుకుంటుంది. దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది ఇళ్ల నుంచి చెత్తను సేకరిస్తున్నప్పటికీ కొందరు అవగాహన లేమితో చెత్తను ఖాళీస్థలాల్లో పారబోస్తున్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలి. చెత్తను ఇళ్లు, ఖాళీస్థలాలు, రోడ్ల పక్కన వేయొద్దు. పంచాయతీల నుంచి చెత్తను సేకరించే సిబ్బందికి ప్రజలు, వ్యాపారులు సహకరించాలి. అప్పుడే గ్రామాల్లో వందశాతం శుభ్రత నెలకొంటుంది. సిబ్బంది చెత్తను సేకరిస్తున్నప్పటికీ కొందరు అవగాహన లేమితో రోడ్ల పక్కన పారబోస్తున్నారు.

– సుదర్శన్‌గౌడ్, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు

నిర్వహణకు సహకరించాలి

ప్రస్తుతం అన్ని గ్రామాల్లో సిబ్బంది చెత్తను సేకరిస్తున్నారు. కాగా కొందరు చెత్తను ఖాళీ స్థలాల్లో పారబోస్తున్నారు. ఇలాంటి విధానానికి స్వస్తి పలికి పారిశుద్ధ్య నిర్వహణలో పంచాయతీకి సహకరించాలి. ముఖ్యంగా ప్రజలు, నాయకులు, యువజన సంఘాలు తమ తమ గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించుకుంటే ప్రతి ఒక్కరికి అవగాహన వస్తుంది.

– అరుంధతి, ఎంపీడీఓ

ఆత్మరక్షణకు కరాటే దోహదం

కాంగ్రెస్ నాయకుడు సుదర్శన్‌గౌడ్



విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేస్తున్న నాయకులు

కొత్తూరు: యువతీ, యువకులు ఆత్మరక్షణకు తప్పకుండా యుద్ధవిద్యలు నేర్చుకోవాలని మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ అన్నారు. బోధివర్మ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు చేసిన పలు విన్యాసాలు చూపరులను అలరించాయి. అనంతరం ఆయనతో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరూ ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యుద్ధ విద్యలు నేర్చుకునే వారిలో ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌యాదవ్, యాదయ్య, తేజ, భార్గవ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి



జెండా ఆవిష్కరణ చేస్తున్న రామస్వామి, నాయకులు

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

మొయినాబాద్: నల్గొండలో నిర్వహించే పార్టీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మండలంలోని పెద్ద మంగళారం గ్రామంలో ఆదివారం పార్టీ వంద వసంతాల వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన జెండావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ అన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు పేదప్రజలు, కార్మికులు, కర్షకుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. రైతాంగ సాయుధ పోరాటంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందన్నారు. దాదాపు పది లక్షల ఎకరాల భూమి పేదలకు పంచి, 4వేల గ్రామాలను వెట్టిచాకిరి నుంచి విముక్తి చేయించినట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీన నల్గొండలో నిర్వహించే బహిరంగ సభలో కార్మికులు, కర్షకులు, రైతులు, ప్రజాసంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు ఎం.ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, నాయకులు సత్తయ్య, వెంకటయ్య, మల్లేశ్, ఎ.శ్రీనివాస్, సుధాకర్‌గౌడ్, అంజయ్య, యాదగిరి, యశోద, లక్ష్మణ్, బాల్‌రాజ్, వెంకటేశ్, నర్సింలు తదితరులు ఉన్నారు.

హామీల అమలులో విఫలం



రవిచందర్ గుప్తాను సన్మానిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ ఆరోపించారు. ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి మంగళ్‌పల్లి వార్డులో నిర్వహించిన పార్టీ సంస్థాగత ఎన్నికలో అధ్యక్షుడిగా రవిచందర్‌గుప్తాను నియమించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి కాలం చెల్లిందని, ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ సరిగా నెరవేర్చలేదని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు తప్ప ఒరగబెట్టిందేమి లేదని, రుణమాఫీ పూర్తి చేయలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు లచ్చిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, పార్లమెంట్ కన్వీనర్ నారాయణయాదవ్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఏఎస్‌ఐ మృతి

నివాళులర్పించిన ఏసీపీ రంగస్వామి, సిబ్బంది

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న కందాడ వెంకట్‌రెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యారు. వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆదిబట్ల సమీపంలోని నాదర్‌గుల్‌లో నివాసం ఉంటున్నారు. జూలైలో షాద్‌నగర్‌కు బదిలీపై వచ్చిన వెంకట్‌రెడ్డి గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ విధులకు రాకుండా సెలవుపై వెళ్లారు. ఆరోగ్యం విషమించడంతో కందాడ వెంకట్‌రెడ్డి ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ విజయకుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ బలరాం నాదర్‌గుల్‌కు చేరుకొని వెంకట్‌రెడ్డి భౌతికాయానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఏఎస్‌ఐ వెంకట్‌రెడ్డి చిన్న వయసులోనే అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని ఏసీపీ అన్నారు. పోలీసుశాఖ తరపున వెంకట్‌రెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటామని ఆయన హామీనిచ్చారు.

'హెచ్‌ఎంపై దాడి హేయమైన చర్య'

షాద్‌నగర్‌రూరల్: జిల్లాలోని మహేశ్వరం మండలం తుక్కుగూడలో గెజిటెడ్ హెచ్‌ఎంపై భజరంగ్‌దళ్ నాయకులు, అయ్యప్ప భక్తుల ముసుగులో దాడి చేయడం హేయమైన చర్య అని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి దొడ్డి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తి మార్గాన వెళ్తున్న అయ్యప్ప భక్తులు బీఆర్‌ఎస్, బీజేపీ కుట్రలో భాగస్వాములు కావొద్దని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల కాళ్లు మొక్కాలని చెప్పడం ఏ విధమైన సంస్కృతికి నిదర్శనమని ప్రశ్నించారు. హెచ్‌ఎం దళితుడైనందునే ఇలా దాడి చేశారన్నారు. హెచ్‌ఎంపై దాడి జరిగి మూడురోజులు గడుస్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినా దళిత సమాజంపై జరుగుతున్న దాడులు ఆగడం లేదని తెలిపారు. హెచ్‌ఎంపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కడ్తాల్: మండల పరిధి టాక్‌రాజ్‌గూడ తండాలో నిర్మిస్తున్న జగదాంబ మాత దేవాలయానికి గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ రూ.51 వేలు, స్థానిక నాయకులు ముత్తి కృష్ణ రూ.15 వేలు విరాళం ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఆలయ నిర్వాహకులకు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు బలరాంనాయక్, జగన్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ప్రజాసంక్షేమమే బీజేపీ ధ్యేయం

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి



పార్టీలో చేరిన యువకులతో విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి విష్ణువర్ధన్‌రెడ్డి కండువాలు కప్పి స్వాగతం పలికారు. అదేవిధంగా గ్రామంలోని రెండు పోలింగ్ బూత్‌లకు పార్టీ అధ్యక్షులుగా రాఘవేందర్, హరీశ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రధాని మోదీ దేశాభివృద్ధికి, దేశ రక్షణ కోసం సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. అదేవిధంగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక పథకాలను రూపొందించి విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. అర్హులైన వారికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందించాలన్నారు. తద్వారా గ్రామస్థాయిలో పార్టీ బలోపేతమవుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు సత్తా చాటాలన్నారు. పార్టీలో చేరిన వారిలో నాయకులు శివరాజ్, రాఘవేందర్, ప్రసాద్, శశి, రాజు, హరీశ్, అభి, వంశీ, నవీన్, ఆనంద్, గణేశ్, అరవింద్, వసంత్, తరుణ్, హర్షిత్, పాండు, అనిల్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

సీఎంకు ఘన స్వాగతం



సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు

నందిగామ: కాన్హా శాంతి వనం పర్యటనకు హాజరైన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి, కొత్తూరు, నందిగామ మండలాల అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింహాయాదవ్, ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు కావలి కృష్ణయ్య, నీరటి రవీందర్, జెగ్గ శేఖర్, కొమ్ము కృష్ణ, జాండగూడెం సుదర్శన్‌గౌడ్, జనిగే జగన్, పసుల బుచ్చయ్య, జెట్ట శ్రీశైలం, మంకాల శ్రీశైలం, చంద్రపాల్‌రెడ్డి, బాల్‌రాజ్, కాశీనాథ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ప్రభాకర్, శేఖర్‌రెడ్డి, లింగారం సురేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ



ప్రవీణ్‌గౌడ్‌కు నియామకపత్రం అందజేస్తున్న కృష్ణ

షాబాద్: పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామంలో బీసీ సేన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ప్రవీణ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా మాణిక్యం, నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా కుమార్, కార్యదర్శులుగా నరేశ్, రమేశ్‌గౌడ్, కావలి శేఖర్, మల్లేశ్, శివకుమార్, సలహాదారుడిగా ఎం.నర్సింలు, సభ్యులుగా కుమార్, వెంకటయ్య, సత్తయ్య, అంజయ్య, నరేశ్‌ను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ లెక్క తేల్చడానికి దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని, పంచాయతీరాజ్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన అగ్రకులాలకు ఒకే రోజులో బిల్లు పెట్టి ఆగమేఘాల మీద 10 శాతం రిజర్వేషన్లు ఆమోదించారన్నారు. 30 సంవత్సరాలుగా పోరాడుతున్నా బీసీల బిల్లుపై కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

ఘనంగా మైసమ్మ బోనాలు



చేవెళ్ల: బోనాల ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

షాబాద్: మండలంలోని ఎర్రోనిగూడ గ్రామంలో ఆదివారం మైసమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగాఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాల ఊరేగింపుతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అందరనీ చల్లగా చూడు తల్లీ అంటూ వేడుకున్నారు. బోనాల ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాల ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎర్రోనిగూడ మాజీ ఉప సర్పంచ్ సామ ప్రతాప్‌రెడ్డి, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

ధర్మసాగర్‌లో..

చేవెళ్ల: మండలంలోని ధర్మసాగర్ గ్రామంలో ఆదివారం బురుజు మైసమ్మ బోనాల ఉత్సవాలను ప్రజలు వైభవంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఆలయంలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. బోనాల ఎదుట పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. చిన్నాపెద్ద తేడాలేకుండా అంతా ఉత్సవాల్లో పాల్గొని ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.



షాబాద్: బోనాల ఊరేగింపులో గ్రామస్తులు

పంటపొలాల్లో ఫార్మాసిటీ వద్దు

- కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలుపుకోవాలి
- కాలుష్యంతో జీవకోటికి ముప్పు
- వ్యతిరేక పోరాట కమిటీ సభ్యురాలు సరస్వతి



కుర్మిద్దలో మాట్లాడుతున్న ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యురాలు కవుల సరస్వతి

యాచారం: రైతులు పంటలు పండించే భూముల్లో ఫార్మాసిటీ వద్దు. ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తే.. రైతులు ఉపాధి కోల్పోతారు. కాలుష్యంతో జీవకోటికి ఇబ్బంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి అని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యురాలు కవుల సరస్వతి అన్నారు. ఫార్మాసిటీ, పరిశ్రమల ద్వారా వెలువడే కాలుష్యం, తద్వారా కలిగే నష్టంపై ఆదివారం కుర్మిద్ద, మర్లకుంటతండాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని కాంగ్రెస్ పార్టీ పెద్దలు హామీ ఇచ్చారని, మాట మార్చి ఇప్పుడు అదే ప్రాంతంలో ఫార్మాసిటీ ఏర్పాటుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లోని 2,500 ఎకరాలకు పైగా పట్టా భూమిని రైతులకు కనీస సమాచారం ఇవ్వకుండా భూరికార్డులను టీజీఐఐసీ పేరిట మార్చేశారని పేర్కొన్నారు. ఆ భూ రికార్డులను రైతుల పేరిట మార్చాలని ఆందోళన, ధర్నాలు చేసినా ఫలితం లేదని వాపోయారు. పైగా రైతులపై అక్రమ కేసులు పెట్టి భయాందోళనకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఫార్మాసిటీకి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు రైతులు, ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతులు నారాయణ, అచ్చిరెడ్డి, నిరంజన్, గణేశ్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.